
సాక్షి
విశాఖపట్నం
బుధవారం ၊ 20 ၊ డిసెంబర్ ၊ 2023



విద్యార్థుల వికాసమే లక్ష్యం
విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. 8లో



ద్రోణంరాజు సేవలు ఎనలేనివి
ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ద్రోణంరాజు సత్య నారాయణ చెరగని ముద్ర వేశారని రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్ అన్నారు. 8లో



మరికొంతకాలం స్పెషల్ రైళ్లు
ప్రయాణికుల రద్దీ దృష్ట్యా స్పెషల్ రైళ్లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

రేపు చింతపల్లిలో సీఎం జగన్ పర్యటన



సాక్షి, పాడేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 21వ తేదీన చింతపల్లిలో పర్యటించనున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ఆ రోజు ఉదయం 9 గంటలకు బయలుదేరి 9.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో చింతపల్లి పర్యటనకు బయలుదేరుతారు. చౌడుపల్లిలో సిద్ధం చేసిన హెలిప్యాడ్‌కు ఉదయం 10.30 గంటలకు చేరుకుంటారు. అక్కడ ప్రజలతో మాట్లాడతారు. అనంతరం రోడ్డు మార్గంలో బయలుదేరి 10.50 గంటలకు చింతపల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల-1కు చేరుకుంటారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడతారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారు. 11.10 గంటలకు చింతపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన లెర్నింగ్ అండ్ టీచింగ్ స్టాల్‌ను సందర్శిస్తారు. అక్కడ సభలో ప్రసంగిస్తారు. అనంతరం రోడ్డు మార్గంలో చౌడుపల్లిలోని హెలిప్యాడ్‌కు 12.40కు చేరుకుంటారు. అక్కడ స్థానిక నాయకులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 1.30 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖ ఎయిర్‌పోర్టుకు ప్రయాణమవుతారు. అక్కడ నుంచి 2.10గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు.

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్-3 చార్జింగ్ ప్రారంభం



బ్లాస్ట్‌ఫర్నేస్-3 ముఖచిత్రం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు శుభవార్త. గత 21 నెలలుగా ఎదురు చూస్తున్న బ్లాస్ట్‌ఫర్నేస్-3 ఉత్పత్తికి సంబంధించి మంగళవారం మొదటి అడుగు పడింది. బ్లాస్ట్‌ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించి మొదటి బ్యాచ్ కోక్ సాయంత్రం 4.55 గంటలకు చార్జింగ్ ప్రారంభించారు. ఆ తర్వాత 30 టన్నుల చెక్క, అనంతరం 200 టన్నుల కోక్‌తో చార్జింగ్ చేయనున్నారు. ఈ నెల 30న ఉత్పత్తి ప్రారంభించడానికి యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా దశల వారీగా ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడం ద్వారా ఉద్యోగులు తమకు మంచి రోజులు రానున్నాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన



షీలానగర్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం బ్లూ ప్రింట్ పరిశీలిస్తున్న పురందేశ్వరి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణ పనులను మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పరిశీలించారు. ఆస్పత్రి బ్లూ ప్రింట్‌ను పరిశీలించి.. నిర్మాణానికి సంబంధించి అధికారులతో మాట్లాడారు. రూ.354 కోట్ల వ్యయంతో 2015లో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, 2023లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ఎక్కడ పేరు వస్తుందోనని గత టీడీపీ ప్రభుత్వం ఆస్పత్రి నిర్మించకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి.. ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి కావాల్సిన పూర్తి సాయం అందిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, వార్డు అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సైనిక కుటుంబాల సంక్షేమం కోసం విరాళాల సేకరణ

మహారాణిపేట: దేశ రక్షణకు నిరంతర సేవలు అందిస్తూ యుద్ధంలో మరణించిన, గాయపడిన, పదవీ విరమణ పొందిన సైనిక కుటుంబాల సంక్షేమం కోసం విరాళాలు సేకరించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. విద్యార్థులు, కార్మికుల నుంచి సైనికుల సంక్షేమానికి విరాళాలు సేకరించాలని, దీనిలో భాగంగా జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా పరిశ్రమల అధికారికి ప్రభుత్వ ఉత్తర్వులు అందజేశామన్నారు. పాఠశాల విద్యార్థి నుంచి రూ.2, కాలేజీ విద్యార్థి నుంచి రూ.5, పరిశ్రమల్లో పనిస్తున్న కార్మికుల నుంచి రూ.50 పతాక నిధిని వసూలు చేసి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం ఎస్‌బీఐ అకౌంట్ 62078532988 నెంబరుకు జమ చేయాలని పేర్కొన్నారు.

కోవిడ్‌పై ఫుల్ కేర్

- ప్రభుత్వ ఆదేశాలతో అత్యవసర ఏర్పాట్లు
- ఆస్పత్రుల్లో మాక్‌డ్రిల్‌కు చర్యలు
- 21 నుంచి కరోనా నిర్ధారణ పరీక్షలు



కేజీహెచ్‌లో సిద్ధం చేసిన పడకలు 160
పుష్కలంగా ఆక్సిజన్, వెంటిలేటర్లు, కిట్స్, మందులు



మహారాణిపేట: కరోనా.. రూపం మార్చుకుని మళ్లీ కలవరపెడుతోంది. కొత్త వేరియంట్ జేఎన్1 విజృంభిస్తోంది. కొద్ది రోజులుగా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతుండడంతో.. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో కేజీహెచ్, విమ్స్, ఛాతీ ఆస్పత్రి, పెందుర్తి, గోపాలపట్నం, అగనంపూడి, భీమిలి తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రులను జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. కేజీహెచ్‌లో ఐసోలేషన్ వార్డుతోపాటు మరో వార్డులో మొత్తం 160 పడకలను అధికారులు సిద్ధం చేశారు. ఇందులో ఆక్సిజన్, ఐసీయూ, వెంటిలేటర్, సాధారణ పడకలు ఉన్నాయి. మిగిలిన ఆస్పత్రుల్లో కూడా పడకలు సిద్ధం చేస్తున్నారు. కరోనా కోసం కేటాయించిన అన్ని ఆస్పత్రుల్లో మాక్‌డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ల పనితీరును పరిశీలించాలన్నారు. మరో వైపు ఈ నెల 21 నుంచి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 63 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి.జగదీశ్వరరావు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, అనుమానిత లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాగా.. ఒమిక్రాన్ రూపం మార్చుకుని జేఎన్-1గా ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది.

ఈ వేరియంట్ కారణంగా జ్వరం, ముక్కు కారడం, గొంతు నొప్పి, తలనొప్పి తదితర లక్షణాలు ఉంటాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. కొంత మందిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తనున్నట్లు చెప్పారు. రాబోయేది పండగ సీజన్ కాబట్టి.. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని, మాస్కులు ధరించాలని వైద్యాధికారులు కోరుతున్నారు.

సాగర తీరంలో సూపర్ పంచ్

ఉత్సాహంగా సీఎం బాక్సింగ్ స్టేట్ చాంపియన్‌షిప్



బౌట్‌ను ప్రారంభిస్తున్న మారిటైమ్ బోర్డు చైర్మన్ కేవీఆర్



పంచ్ విసురుతున్న బాక్సర్

బీచ్‌రోడ్డు: సాగర తీరంలో సూపర్ పంచ్‌లు సందర్శకులను అలరించాయి. ఒకరి మీద ఒకరు దూకుడిగా పంచులు విసురుతో నువ్వా నేనా అన్నట్లు ఎంతో ఉత్సాహంగా బాక్సింగ్ పోటీల్లో తలపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సీఎం బాక్సింగ్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం వైఎంసీఏ వద్ద ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పుట్టినరోజును పురస్కరించుకొని గత మూడేళ్లగా బాక్సింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో మరిన్ని క్రీడా కార్యక్రమాలకు రూపకల్పన చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జన్మదినమైన 21వ తేదీన పోటీల్లో విజేతలకు ట్రోఫీ, నగదు ప్రోత్సాహకాలు అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొంటారన్నారు.

క్రీడాకారులకు సువర్ణావకాశం

సీఎం జగన్ పుట్టినరోజున పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ పోటీలు క్రీడాకారులకు ఒక సువర్ణ అవకాశామని జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి అన్నారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఇదో చక్కని అవకాశం అన్నారు.

150 మంది క్రీడాకారులు, 12 విభాగాలు

రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరికి 12 విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు. యూత్, జూనియర్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.

తొలి రోజు 26 బౌట్లు

తొలిరోజు మూడు విభాగాల్లో 26 బౌట్లు నిర్వహించారు. యూత్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సందర్శకులకు ఎంతో ఆసక్తిగా మ్యాచ్‌లను తిలకించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎస్ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణానికి ధర్మ ప్రచారం




జ్యోతి ప్రజ్వలన చేసి మాసోత్సవాలు ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ



కనకమహాలక్ష్మికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో ఈవో శిరీష, ధర్మకర్తలు

ధర్మప్రచార మాసోత్సవాలు ప్రారంభం



రథంలో కొలువైన అమ్మవారు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానం ఆధ్వర్యంలో ధర్మప్రచార మాసోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి అంకురార్పణ చేశారు. నాదస్వర వాయిద్యాలు, పులివేషాలు, అమ్మవారి అలంకరణలు, కోలాట నృత్యాల నడుమ మాసోత్సవాలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఉత్సవాలను వచ్చే నెల 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా హిందూ ధర్మం విశిష్టత, గొప్పతనాన్ని వివిధ ప్రాంతాల ప్రజలకు తెలియజేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ హిందూ ధర్మ విశిష్టత, మానవతా విలువలు, అందులో దేవాలయాల పాత్ర గురించి వివరించారు. దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రచార రథం ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవారికి కుంకుమ పూజలు, హిందూ ధర్మం విశిష్టత తెలియజేసే పారాయణాలు, సాహిత్యపురాణ ఇతిహాస సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మప్రచార పరిషత్ డైరెక్టర్ వేదాంతం రాజగోపాలచక్రవర్తి, దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.వి.సురేష్‌బాబు, ఉప కమిషనర్ ఎస్.సుజాత, ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, దేవదాయ శాఖ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుధాల తనిఖీ తప్పనిసరి

సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: అన్ని రకాల ఆయుధాలు, పరికరాలను విధుల్లో వినియోగించాలని.. క్రమం తప్పకుండా వాటిని తనిఖీ చేసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీసులను ఆదేశించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో మంగళవారం పలు విభాగాల పనితీరును సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది తమ విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, రైట్ గేర్ పరికరాల పని తీరు, డాగ్ స్క్వాడ్‌తో బాంబు డిటెక్షన్, నార్కోటిక్స్‌ను ఏ విధంగా వెలికి తీస్తాయో చేసిన ప్రదర్శనలను గమనించారు. కే 9 డాగ్ బృందాన్ని అభినందించారు. మాబ్ ఆపరేషన్‌లో బాష్పవాయువు ప్రయోగిస్తూ గుంపులను ఏ విధంగా చెదరగొడతారో పరిశీలించారు. అనుకోని విపత్తులు ఎదురై ఉగ్రవాద లేదా సంఘ విద్రోహ సంస్థలు దాడులు జరిపినప్పుడు.. వాటిని సమర్థంగా ఎదుర్కొని, తిప్పికొట్టే విధంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాంబ్ డిటెక్షన్ పరికరాలను పరిశీలిస్తున్న సీపీ

ఇంధన పొదుపు సామాజిక బాధ్యత



బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీ

బీచ్‌రోడ్డు : ఇంధనాన్ని పొదుపు చేయడం మనందరం సామాజిక బాధ్యతగా భావించాలని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు వేడుకలను మంళవారం బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ వద్ద నిర్వహించారు. ముందుగా ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో సేవ్ ఎనర్జీ సేవ్ ది నేషన్ నినాదంతో ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఇంధన పొదుపులో రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందన్నారు. ప్రతి ఒక్కరిలో అవగాహన పెరిగి విద్యుత్ పొదుపును పాటిస్తున్నారన్నారు. విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు వారికి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని విద్యా శాఖ అధికారులను సూచించారు. 5 స్టార్ రేటెడ్ విద్యుత్ ఉపకరణాలు వినియోగం ద్వారా విద్యుత్‌ను మరింత పొదుపు చేయవచ్చన్నారు. ప్రభుత్వ సంస్థలు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయన్నారు.

ఇంధన వనరులను వృథా చేయరాదు

భావితరాల అవసరాల దృష్ట్యా ఇంధన వనరులను వృథా చేయరాదని, ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే రెండు యూనిట్లను ఉత్పత్తి చేయవచ్చని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సంస్థ పరిధిలోని అన్ని జిల్లాల్లో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు మాట్లాడుతూ సహజ వనరులను పొదుపు చేసుకుంటూ సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. వ్యక్తిగత పొదుపు వల్ల విద్యుత్ ఆదా కావడమే కాకుండా ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సీజీఎం సింహాద్రి, ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్లు రమేష్ ప్రసాద్, ప్రతాప్, చంద్రం పాల్గొన్నారు.

'కిరణ్‌కృష్ణ'పై డీజీపీకి ఫిర్యాదు

విశాఖ సిటీ: కిరణ్ కృష్ణ రియల్ ఎస్టేట్ సంస్థపై బాధితుడు డాక్టర్ జల్లెళ్ల రఘు రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. 30 ఏళ్ల క్రితం కిరణ్‌కృష్ణ సంస్థ నుంచి స్థలాన్ని కొనుగోలు చేస్తే.. ఇప్పటి వరకు ఆ ప్లాట్ చూపించకపోగా.. పోలీసులకు, సబ్‌రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశానన్న కోపంతో సంస్థ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్ కులం పేరుతో దూషించి, చంపేస్తానని బెదిరించినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రా యూనివర్సిటీ జువాలజీ ప్రొఫెసర్ జె.రఘు 1993లో ఆనందపురం మండలంలో 300 గజాల స్థలాన్ని కిరణ్ కృష్ణ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి కొనుగోలు చేశారు. ఏళ్లు గడిచినా ఆ ప్లాట్ చూపించలేదు. స్థలం కోసం ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా సిబ్బంది తప్పించుకొని తిరగడంతో చివరకు 2008లో నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డాక్యుమెంట్‌లో తప్పులు పడ్డాయని, సరిచేసి ఇస్తామని చెప్పి వేరే డాక్యుమెంట్ ఇచ్చినప్పటికీ స్థలాన్ని మాత్రం చూపించలేదు. మళ్లీ రఘు కిరణ్ కృష్ణ ఆఫీస్ చుట్టూ తిరిగినప్పటికీ అందులో సిబ్బంది ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ సంవత్సరాలు గడిపేశారు. కొద్ది రోజుల క్రితం మళ్లీ ఆనందపురం పోలీస్‌స్టేషన్‌లోను, అలాగే ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ పిలుపు మేరకు రఘు ఆనందపురం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడి నుంచి ఫోన్‌లో సంస్థ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్‌కు ఫోన్ చేయగా.. కులం పేరుతో దూషించి చంపేస్తానని బెదిరించినట్లు డీజీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను దూషించి బెదిరించిన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరారు.

ఆనందపురం పోలీసులకు బాధితులు ఫిర్యాదు

రైతుల స్థలాలను రోడ్డుగా చూపించి లేఅవుట్‌లో 102 మందికి ప్లాట్లు విక్రయించి మోసం చేసిన కిరణ్‌కృష్ణ రియల్ ఎస్టేట్ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని లక్ష్మీ నరసింహ ప్రియదర్శిని నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఆనందపురం మండలం గండిగుండం గ్రామంలో సర్వే నెంబర్ 41-1ఈ-1, కొత్త సర్వే నెంబర్ 70/పార్ట్‌లో కిరణ్‌కృష్ణ రియల్ ఎస్టేట్ సంస్థ 1992లో ప్రియదర్శిని నగర్ పంచాయతీ లేఅవుట్ పేరుతో 102 ప్లాట్లు విక్రయించింది. సదరు లేఅవుట్‌కు సంబంధించి ప్లాన్‌లో రోడ్డు చూపించారు. అయితే ఆ రోడ్డు స్థలం కిరణ్‌కృష్ణ సంస్థకు చెందినది కాదని, రైతుల వ్యవసాయ స్థలంగా తెలుసుకున్నారు. ఈ విషయంపై గత పదేళ్లుగా కిరణ్ కృష్ణ సంస్థ ప్రతినిధులను సంప్రదించినప్పటికీ ఎవరూ సమాధానం చెప్పడం లేదు. ప్రస్తుతం ఆ లేఅవుట్‌లోకి వెళ్లడానికి రోడ్డు కూడా లేదు. రోడ్డు స్థలం వారిది కాకపోయినా ప్లాన్‌లో చూపించి ప్లాట్లు విక్రయించి మోసం చేసిన కిరణ్‌కృష్ణ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్, అతని భార్యపై క్రిమినల్ చర్యలు తీసుకొని న్యాయం చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు నిరంజన్ రావు, కార్యదర్శి సి.హెచ్.కృష్ణారావు ఫిర్యాదులో కోరారు.

క్లుప్తంగా

ఎన్నికల పర్యవేక్షకుడి విశాఖ పర్యటన నేడు

మహారాణిపేట: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024లో భాగంగా ఏపీ ఓటరు జాబితా పర్యవేక్షకుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు బుధవారం విశాఖలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆయన విశాఖలో అందుబాటులో ఉంటారని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. అనంతరం శ్రీకాకుళం వెళతారని, 22న అల్లూరి సీతారామరాజు జిల్లా(పాడేరు)లో పర్యటిస్తారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు చంద్రబాబు రాక

మహారాణిపేట: తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్రబాబు బుధవారం విశాఖ వస్తున్నారు. మధ్యాహ్నం 12.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని సన్‌రే విలేజ్ రిసార్ట్‌కు వెళతారు. రాత్రి 7.30 గంటలకు చంద్రబాబు తిరిగి విశాఖ విమానాశ్రయానికి చేరుకుని.. 7.40 గంటలకు విజయవాడ బయలుదేరుతారు.

పూర్వ విద్యార్థినిపై లైంగిక దాడికి యత్నం

పోలీసుల అదుపులో నిందితుడు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థినిపై అదే ప్రాంతంలోని షైవుడ్ ఫ్యాక్టరీకి చెందిన ఉత్తరాది కార్మికుడు మంగళవారం లైంగిక దాడికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పార్వతీపురానికి చెందిన ఆమె 2021లో ఇక్కడి కళాశాలలో సీఎస్‌సీ పూర్తి చేసింది. ప్రస్తుతం ఆ కళాశాలను మరో యాజమాన్యం నిర్వహిస్తోంది. కాగా.. సర్టిఫికెట్ల కోసం వచ్చిన ఆమెపై మద్యం సేవించిన కార్మికుడు నిర్మానుష్య ప్రాంతంలో దాడికి యత్నించాడు. ఇది గమనించిన పశువుల కాపరులు(మహిళలు).. ఆమెను రక్షించి తీసుకువెళ్లారు. కళాశాల సిబ్బంది ఫిర్యాదుతో భీమిలి పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆమెను భీమిలి స్టేషన్‌కు తరలించి.. ఆమెతో పాటు స్థానికులను విచారించారు. వారు చెప్పిన వివరాలతో దాకమర్రి, బోడమెట్టపాలెం పరిసర ప్రాంతాల్లోని షైవుడ్ ఫ్యాక్టరీల్లో గాలించి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. భీమిలి సీఐ డి.రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యం



బెలూన్లు వదిలి క్రీడలు ప్రారంభిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, అతిథులు



పాల్గొన్న పలు పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా బృందాలు

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ జోనల్ మీట్ ప్రారంభం

మురళీనగర్: విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల(గైస్) ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలనే మంచి ఉద్దేశంతో జోనల్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే అతిపెద్ద క్రీడా ఈవెంట్ 'ఆడుదాం ఆంధ్ర' త్వరలోనే ప్రారంభమవుతుందన్నారు. ఈ మీట్‌లో క్రీడాస్ఫూర్తితో విద్యార్థులు ఆడాలని సూచించారు. టీచర్ ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనే విధంగా వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కేవలం చదువే కాకుండా ఇతర ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పెట్రో కారిడార్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మీవెంకటరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కిరణ్ కృష్ణ, ఏపీ వాడోకాయ్ కరాటే అసోసియేషన్ చైర్మన్ బొడ్డేటి కాశీ విశ్వనాథం తదితరులు ప్రసంగించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బోకం దేముడు, 27 కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ముందుగా జాతీయ, క్రీడా పతాకాలను కె.కె.రాజు ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారుల నుంచి కె.కె.రాజు, అతిథులు గౌరవ వందనం స్వీకరించి బెలూన్లు వదిలారు. వాలీబాల్ క్రీడను కె.కె.రాజు ప్రారంభించారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి వందలాది క్రీడాకారులతో మొదటి రోజు ఉత్సాహంగా పోటీలు సాగాయి. గైస్, పాలిటెక్నిక్ కాలేజీల్లో వేర్వేరుగా క్రీడలు నిర్వహించగా.. బాలబాలికలకు ప్రత్యేకంగా వసతి, భోజన సౌకర్యాలు కల్పించారు.

ఘనంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు

క్రీడోత్సవాల్లో భాగంగా విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కె.కె.రాజు సమక్షంలో విద్యార్థులు కేక్ కట్ చేసి అతిథులకు పంచిపెట్టారు. జై జగనన్న అంటూ నినాదాలు చేశారు.

మరి కొంతకాలం స్పెషల్ రైళ్ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: పండగల వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా ప్రాంతాలకు ప్రస్తుతం నడుస్తున్న స్పెషల్ రైళ్లు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

- విశాఖపట్నం–కర్నూలు సిటీ (08585) వీక్లీ స్పెషల్ విశాఖలో ప్రతీ మంగళవారాల్లో సాయంత్రం 5.35గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.25 గంటలకు కర్నూలు సిటీ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జనవరి 16, 23, 30 తేదీల వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో కర్నూలు సిటీ–విశాఖపట్నం (08586) వీక్లీ స్పెషల్ మహబూబ్‌నగర్‌లో ప్రతీ బుధవారాల్లో మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జనవరి 17, 24, 31వ తేదీ వరకు పొడిగించారు.
- భువనేశ్వర్–తిరుపతి(02809) వీక్లీ స్పెషల్ ప్రతీ శనివారాల్లో మధ్యాహ్నం 1.30 గంటలకు భువనేశ్వర్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 7.35 గంటలకు దువ్వాడకు, మరుసటిరోజు ఉదయం 10.30గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు జనవరి 13, 20, 27వ తేదీ వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి–భువనేశ్వర్(02810) వీక్లీ స్పెషల్ ప్రతీ ఆదివారం రాత్రి 8.15 గంటలకు తిరుపతిలో బయల్దేరి, మరుసటిరోజు ఉదయం 9.30గంటలకు దువ్వాడకు అదేరోజు సాయంత్రం 5.25 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ జనవరి 14, 21, 28వ తేదీ వరకు పొడిగించారు.

పలు రైళ్ల రద్దు

వాల్తేర్ డివిజన్ పరిధి సింహాచలం నార్త్ యార్డ్ విశాఖపట్నం–పలాస సెక్షన్ పరిధిలో ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–కోరాపుట్–విశాఖపట్నం(08546/08545) పాసింజర్ స్పెషల్ ఈ నెల 23, 24 తేదీల్లో ఇరువైపులా, విశాఖపట్నం–విజయనగరం–విశాఖపట్నం (07468/07469) మెము పాసింజర్ ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఇరువైపులా రద్దు చేశారు.

గమ్యం కుదింపు

విశాఖపట్నం–పలాస–విశాఖపట్నం (07470/07471)మెము స్పెషల్ పాసింజర్ ఈ నెల 23, 24, 25 తేదీల్లో విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది.

దారి మళ్లింపు

ఈ నెల 22వ తేదీన బెంగళూరు–హౌరా(12246) ఎక్స్‌ప్రెస్, ఈరోడ్– సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లు గోపాలపట్నం–విశాఖపట్నం–సింహాచలం నార్త్ స్టేషన్ల మీదుగా నడుస్తాయి.

ముగిసిన వార్షిక స్పోర్ట్స్ మీట్



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విజయనగరం ఎస్పీ దీపికా పాటిల్

పీఎంపాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్ పోలీస్ శిక్షణ కేంద్రంలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఏడో వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. 16వ బెటాలియన్ కమాండెంట్ గౌతమీ శాలిని పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో పోలీస్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయనగరం ఎస్పీ దీపికా పాటిల్ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్న పోలీస్ క్రీడాకారులను డిపార్టుమెంట్ అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. జాతీయ అంతర్జాతీయిలో ప్రతిభ కనబరిచి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరుతో పాటు వ్యక్తి గతంగానూ కీర్తి ప్రతిష్టలు పొందాలన్నారు. ముగింపు కార్యక్రమంలో పోలీస్ బ్యాండ్ బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పి.శామ్యూల్ జాన్ పాల్గొన్నారు.

పెళ్లి.. విడాకులు.. ఇంకో పెళ్లి!

- నఖ్యత లేక కొన్నాళ్లకే విడిపోయిన జంట
- మొదటి పెళ్లి వివరాలతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు
- నేరం రుజువు కావడంతో ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు ఏడాది జైలు

విశాఖ లీగల్: ఓ జంటకు అగ్ని సాక్షిగా వివాహం జరిగింది. కొంత కాలం కాపురం చేశారు. మనస్పర్థలు రావడంతో విడిపోయారు. అన్ని విషయాలు దాచి పెట్టి మళ్లీ పెళ్లి కోసం మహిళ కుటుంబ సభ్యులు పరిణయ వేదికలో ప్రకటన ఇచ్చారు. ఆ ప్రకటనకు ఆకర్షితుడైన బాధితుడు ఆమెను పెళ్లి చేసుకున్నాడు. కొన్ని రోజులు కాపురం చేసిన తర్వాత ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పిలిచినా రాకపోవడంతో అతను న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. న్యాయస్థానం సూచనతో ఇద్దరూ రాజీపడి కొంత కాలం కాపురం చేసి మళ్లీ విడిపోయారు. ఈ సారి ఆమె తల్లిదండ్రులు అతనిపై ఫిర్యాదు చేశారు. దీంతో అతను ఆమె గురించి ఆరా తీసి.. ఆ వివరాలతో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆమెపై పోలీసులు కేసు పెట్టారు. నేరం రుజువు కావడంతో ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు న్యాయమూర్తి ఏడాది జైలు, రూ.5 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా నెల రోజులపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ఈ కేసు వివరాలివీ. ఫిర్యాది విశాఖలో సిరిపురం ప్రాంతానికి చెందిన ఎడ్ల శ్రీనివాసరావు. తన వివాహం కోసం భారత్ మ్యాట్రిమోనీ అనే వివాహ వేదికను ఆశ్రయించాడు. ఆయన పేర్కొన్న విధంగా తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం ప్రాంతానికి చెందిన రమాదేవి అనే ఉపాధ్యాయురాలు జోడి కుదిరినట్టు మ్యాట్రిమోనీ ప్రతినిధులు అతనికి సమాచారం ఇచ్చారు. ఇరు కుటుంబాలు ఇష్టపడటంతో 2012 డిసెంబర్ 22న వీరికి వివాహం జరిగింది. కొంత కాలం భార్యాభర్తలు అన్యోన్యంగా ఉన్నారు. తర్వాత రమాదేవి పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి పిలిచినా రాలేదు. దీంతో శ్రీనివాసరావు విశాఖలోని కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. న్యాయస్థానం ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో మళ్లీ రమాదేవిని కాపురానికి పంపించారు. అయినా ఆమెలో మార్పు రాలేదు. చివరికి భార్యాభర్తల మధ్య సఖ్యత లేకపోవడంతో విడాకులు తీసుకున్నారు. అంతటితో ఆగకుండా రమాదేవి తల్లిదండ్రులు కృష్ణమూర్తి, ప్రభావతి, సోదరుడు నరేంద్ర, సోదరి ప్రొఫెసర్ సునీత మరికొందరు శ్రీనివాసరావుపై అక్రమ కేసులు బనాయించారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు రమాదేవి కుటుంబ వివరాలను సేకరించాడు. సునీల్ అనే వ్యక్తితో రమాదేవికి 2003 జూన్ 21న వివాహం జరిగింది. ఆ వివాహం రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. ఇరువురి మధ్య భేదాభిప్రాయాలు రావడంతో చట్టరీత్యా విడాకులు తీసుకున్నారు. ఆ వివరాలన్నీ శ్రీనివాసరావుకు చెప్పలేదు. ఈ వివరాలు సేకరించిన శ్రీనివాసరావు తగిన ఆధారాలతో మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ జరిపిన పోలీసులు.. ఆమెతో పాటు కుటుంబ సభ్యులపై నేరాభియోగ పత్రాలను దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి టి.వి. రాజేష్.. నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు ఇచ్చారు. ఇటువంటి కేసులు దాఖలు కావడం అరుదుగా జరుగుతుందని పలువురు వ్యాఖ్యానించారు.

ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ద్రోణంరాజు చెరగని ముద్ర

రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్



ద్రోణంరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకట కుమారి

బీచ్‌రోడ్డు: ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ద్రోణంరాజు సత్యనారాయణ చెరగని ముద్ర వేశారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ద్రోణంరాజు సత్యనారాయణ 91వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం సిరిపురంలో ద్రోణంరాజు సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి మంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ద్రోణంరాజు సత్యనారాయణ తన రాజకీయ చతురతతో బలమైన నాయకుడిగా ఎదిగారన్నారు. ఆయన ఓ పొలిటికల్ యూనివర్సిటీ వంటి వారని, ఎంతో మంది ఆయన శిష్యరికంలో రాజకీయ నాయకులుగా ఎదిగి వివిధ పదవుల్లో ఉన్నారన్నారు. నా తాత, నా తండ్రితో కూడా ఆయనకు రాజకీయ అనుబంధం ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం ఆయన ఎంతో తపన పడేవారన్నారు. ద్రోణంరాజు ఆలోచనలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని రాజకీయ నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి మాట్లాడుతూ ద్రోణంరాజు సత్యనారాయణ చిరస్మరణీయుడని, విశాఖపట్నానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఎమ్మెల్యే అదీప్ రాజ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు పాల్గొన్నారు.

కేక్ మిక్సింగ్ సందడి



కేక్ మిక్సింగ్ చేస్తున్న యువతులు

విశాఖ సిటీ: బ్లూ మ్యాంగో గౌర్మెట్‌లో కేక్ మిక్సింగ్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెదవాల్తేరు ప్రాంతంలో సంప్రదాయ ఇంటీరియర్స్‌తో పాశ్చాత్య వెరైటీలను అందించే కాఫీ షాప్‌లో యూరప్ క్రిస్మస్ సంప్రదాయ విధానంలో కేక్ మిక్సింగ్ చేపట్టారు. బ్లూ మ్యాంగో గౌర్మెట్ యజమానురాలు భాగ్యర్క సిన్హా ఆధ్వర్యంలో జరిగిన ఈ మిక్సింగ్ సెలబ్రేషన్స్‌లో యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 100 కేజీల ఈ కేక్‌లో 15 రకాల డ్రై ఫ్రూట్స్, ఆరెంజ్ జ్యూస్‌తో పాటు లిక్కర్(బ్రాందీ, విస్కీ, రమ్) మిక్స్ చేశారు. ఈ నెల 25 క్రిస్మస్ నాటికి పూర్తిస్థాయిలో కేక్‌ను సిద్ధం చేయనున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- పూర్తయిన గృహాలకు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి
- పనిచేయని అధికారులపై చర్యలు తప్పవు: కలెక్టర్ మల్లికార్జున



విశాఖ సిటీ: జిల్లాలో జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జేసీ కె.ఎస్.విశ్వనాథన్, హౌసింగ్ విభాగ అధికారులతో కలిసి మంగళవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. పనుల్లో మరింత ప్రగతి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఇప్పటివరకు పూర్తయిన గృహాలకు ఫొటోలను తీసి వాటిని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంట్, అలాగే ఇప్పటివరకు చేపట్టిన పనులకు సంబంధించి నిధులు కొరత లేదన్నారు. బిరిష్ అప్‌డేట్ కావడం లేదని క్షేత్ర స్థాయి ఇంజినీర్లు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. వారంలోగా 95 శాతం ప్రగతి కనబరచాలని, పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి జగన్ గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించారని, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి ప్రగతి సాధించాలని సూచించారు. నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు లబ్ధిదారుల వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. అర్బన్ ప్రాంతంతో పాటు ఆనందపురం, పద్మనాభం, భీమిలి తదితర మండలాల్లో కూడా గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుని ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

హోంగార్డు నియామక పత్రాల అందజేత



నియామక పత్రాన్ని అందజేస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: నగరంలోని హోంగార్డు యూనిట్‌లో విధి నిర్వహణలో మరణించిన ఇద్దరు హోంగార్డు కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలను పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అందజేశారు. హోంగార్డులు పి.వి.సత్యనారాయణ, జి.ప్రకాశరావు గత కొద్ది కాలం క్రితం విధి నిర్వహణలో మరణించారు. దీంతో సత్యనారాయణ భార్య పి.వరలక్ష్మికి, ప్రకాశరావు భార్య జి.ప్రియాంకకు హోంగార్డులుగా నియామక పత్రాలు సీపీ తన చాంబర్‌లో అందజేశారు. కార్యక్రమంలో విశాఖ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ యు.రామ్మోహన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(అడ్మిన్ అండ్ హోంగార్డ్స్) టి.భగవాన్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్: యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ నగరంలోని రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పైడి పాపారావు అందించిన వివరాలు ఎలా ఉన్నాయి. నిందితుడు కె.సతీష్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొబ్బరితోట ప్రాంతంలోని ఎస్‌వీపీ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. వృత్తిరీత్యా కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. సతీష్‌పై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్‌గా కూడా పేరు ఉంది. బాధితుడు సంతోష్ కుమార్ కూడా అదే ప్రాంతానికి చెందిన వాడు. 2019 జనవరి 5వ తేదీన సతీష్ బాధితులతో గొడవ పెట్టుకున్నాడు. రాత్రి 8 గంటల సమయంలో పదునైన కత్తితో గొంతుపై భాగంలో బలంగా గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాల మధ్య సంతోష్‌ని కేజీహెచ్‌లో చేర్పించారు. తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు నిందితులపై ఐపీసీ 37 కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

కార్మికుల్ని రోడ్డెక్కించి సిటూ సాధించేదేంటో?

- సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ మేరకే సమాన పనికి.. సమాన వేతనం
- అడగకుండానే ప్రభుత్వం అన్ని ఇస్తున్నా.. సమ్మె ఎందుకో..
- గతంలో వ్యతిరేకించిన జీవో.. ఇప్పుడు కావాల్సి వచ్చిందా?
- సమ్మెకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ దూరం
- యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు



మాట్లాడుతున్న యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు

డాబాగార్డెన్స్: కార్మికులను మభ్యపెట్టి రోడ్డెక్కిస్తున్న సిటూ ఇప్పటివరకు సాధించింది ఏంటో తెలపాలని.. అడగకుండానే ప్రభుత్వం అన్నీ ఇస్తున్నా సమ్మె ఎందుకోనని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహాదేవ్ ఆనందరావు ప్రశ్నించారు. 2013లో జీవో 7ని వ్యతిరేకించిన సిటూ ఇప్పుడు అదే జీవోని అమలు చేయాలంటూ ఈ నెల 27 నుంచి సమ్మెకి దిగుతామంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సిటూ, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ చేపట్టనున్న సమ్మెకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ దూరమని వెల్లడించారు. జీవీఎంసీ సమీపంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మె అర్థరహితమన్నారు. ఈ నెల 14న స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సీడీఎంఎస్ అధికారులతో జరిగిన చర్చల్లో యూజీడీ కార్మికులు, పీహెచ్ డ్రైవర్లు, మలేరియా కార్మికులు, పార్కుల్లో పనిచేస్తున్న వారికి హెల్త్ అలవెన్స్ అమలు చేస్తామని, జీవీఎంసీ పీహెచ్ విభాగంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, వర్కర్ కమ్ డ్రైవర్లకు సెమీ స్కిల్డ్ వేతనాలు(జీవో 7 ప్రకారం)రూ.18,500 చెల్లించేందుకు. రైవాడ కెనాల్లో పనిచేస్తున్న 105 మందికి, అన్‌స్కిల్డ్‌గా ఉంటూ పదేళ్ల అనుభవంతో ఐటీఐ సర్టిఫికెట్ ఉన్న 119 మందికి సెమీ స్కిల్డ్ జీతం రూ.18,500 చెల్లించేందుకు అంగీకరించారన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ వర్కర్లకు కూడా ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్, స్కిల్డ్ వేతనాలు మంజూరయ్యేలా జీవో 30ని సవరించి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు నివేదిక పంపుతామని చెప్పారన్నారు. అలాగే అవుట్ సోర్సింగ్ కార్మికుల రిటైర్మెంట్ వయసు 60 ఏళ్లుగా పెంచుతూ మెమో జారీ చేస్తామని తెలిపారన్నారు. జీవో 25 ప్రకారం అవుట్‌సోర్సింగ్ కార్మికులు ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.5 లక్షలు, సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు ఇటీవల నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆమోదం జరిగిందన్నారు. అర్హులైన కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా త్వరలోనే విడుదల కానుందన్నారు.

ఇదిలా ఉండగా.. సిటూ నాయకులు ఉన్నదానికి, లేనిదానికి సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి తప్పా మరొకటి లేదన్నారు. 2013లో అప్పటి ప్రభుత్వం జీవో 1615 ప్రకారం బేసిక్ పే 13,000+డీఏ అమలు చేస్తామని చెప్పినా కూడా సిటూ ఒప్పుకోకుండా మొండిగా 14 రోజులు సమ్మె చేసి, ఆ జీవోను అమలు కాకుండా కార్మికుల పొట్ట కొట్టిందన్నారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వాన్ని బతిమలాడితే కేవలం వెయ్యి మాత్రమే పెంచిందన్నారు. ఇదంతా సిటూ ప్రభావం వల్లేనని, లేదంటే మున్సిపల్ కార్మికుల బేసిక్ రూ.20 వేలు ఎవరినీ అడగకుండానే వచ్చేదన్నారు. దీనిపై సిటూ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎవరూ అడగకుండానే రూ.6 వేల హెల్త్ అలవెన్స్ చెల్లించారని గుర్తు చేశారు. సమాన పనికి సమాన వేతనం అనేది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో అంశమని.. రాష్ట్ర ప్రభుత్వం అందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం నిర్ణయం ఉంటుందన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు సత్యం, కింతాడ శ్రీనివాసరావు, బంగారి కుమార్, మందా సూరిబాబు, జి.శ్రీనివాస్, పి.కనకరాజు, కె.దుర్గాప్రసాద్, ఇ.రామకృష్ణ, వి.జీవన్, సాగర్‌మూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.